# వీడీసీల ముసుగులో అరాచకం

- బడుగు బలహీన, దళితవర్గాలపై దాష్టీకం
- కులవృత్తిదారుల నుంచి లక్షల్లో వసూలు
- ఇవ్వకుంటే కుల బహిష్కరణలు
- ఇదేమని అడిగితే భౌతికదాడులు
- ప్రజాప్రతినిధులన్నా లెక్కలేదు
- ఉన్నతాధికారులకు తెలిసినా ఆపరు
- ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా దిక్కులేదు
- బీసీ కమిషన్ ఆదేశించినా లేని స్పందన
- కొన్ని వర్గాల ఆధిపత్యం, తెరవెనక స్వామి
- బీసీ, ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల ఆగ్రహం




హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)లు అంటే.. ఒకప్పుడు ఊరు బాగు కోసం.. ఊరి జనం కోసం పాటు పడేవి. కానీ, ఇప్పుడు కొందరు ఆ కమిటీల పేరిట ఊళ్లలో అరాచకం సృష్టిస్తున్నారు. రాజ్యాంగేతర శక్తులుగా మారి శాసిస్తున్నారు. న్యాయవ్యవస్థను, పోలీసు వ్యవస్థను, అధికార వ్యవస్థనూ లెక్క చేయకుండా పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలపై, కులవృత్తిదారులపై దాష్టీకాలకు పాల్పడుతున్నారు. వెరసి గ్రామ అభివృద్ధి కమిటీలు గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాట వింటే సరి.. లేదంటే కుల బహిష్కరణలు విధిస్తున్నాయి. మరీ ముఖ్యంగా నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, జగిత్యాలలో ఇలాంటి ఆగడాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అయితే, ఆ కమిటీల వెనుక ఓ సాములోరు ఉన్నారనేది కుల సంఘాల అభియోగం. కమిటీల ఆగడాలపై ఫిర్యాదులు చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం, ప్రజాప్రతినిధులు సైతం ప్రశ్నించకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

### రాజ్యాంగేతర శక్తులుగా వీడీసీలు

గతంలో తాము పుట్టిపెరిగిన గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్న సదుద్దేశంతో విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు, విదేశాల్లో స్థిరపడిన వారు, వ్యాపారవేత్తలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ)లను ఏర్పాటు చేసుకునే వారు. ప్రభుత్వం మీద ఆధారపడకుండా తామే గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలన్నది ఈ వీడీసీల ఏర్పాటు వెనుక ఉద్దేశం. అయితే ఇవేవీ అధికారికంగా గుర్తింపు పొందినవి కావు. గ్రామంలోని ప్రతీ ఒక్కరి నుంచి విరాళాలను సేకరిస్తూ అధ్యాత్మిక, అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించేవి. అది గతం. అయితే, ఇప్పుడు రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో వీడీసీల పేరిట అరాచకశక్తులు రాజ్యం చేస్తున్నాయి. మరీముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో కొన్నిప్రాంతాల్లో ఈ కమిటీలు ఇప్పుడు సమాంతర ప్రభుత్వాలను నడుపుతున్నాయి. ఆయా కమిటీలు గ్రామాల్లోని గీత కార్మికులు, మత్స్యకారులు, గొర్రెల కాపరులు, అరెకటిక, నాయీబ్రాహ్మణ, రజక తదితర కులవృత్తిదారులపై ఆధిపత్యం చేస్తున్నాయనే విమర్శలున్నాయి. వృత్తిదారులు తాము నిర్ణయించిన మొత్తం 'హర్గాల్' చెల్లించాలని, చెప్పిన రేటుకే చేపలు విక్రయించాలని, క్షవరం చేయాలని, బట్టలు ఉతకాలని, మాంసం విక్రయించాలని, ఎట్టిగా తమ భూముల్లో గొర్ల మందలను ఏర్పాటు చేయాలని హుకుం జారీ చేస్తున్నాయి. గ్రామ అభివృద్ధి పేరిట వృత్తిదారుల నుంచి లక్ష రూపాయలను బలవంతంగా వసూలు చేస్తున్నాయి. మాట వినని కులాలపై భౌతికదాడులకు తెగబడటమే కాకుండా, కులబహిష్కరణలను విధిస్తూ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నాయి. పోలీసు, అధికార వ్యవస్థనే కాదు, రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కూడా శాసించేస్థాయికి ఈ కమిటీలు చేరాయి. కమిటీ అనుమతి లేనిదే ఊర్లలో ఎవరూ అడుగుపెట్టని దుస్థితి నెలకొన్నది.

### తెరవెనుక సాములోరు!

ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వీడీసీల వెనక ఇప్పటికే అనేక వివాదాలను, ఆరోపణలను ఎదుర్కొంటున్న ఓ సాములోరు ఉన్నారని కులసంఘాల నాయకులు, బాధితులు ఆరోపిస్తున్నారు. నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు సంబంధించి వీడీసీలను ఆ సాములోరే తన చెప్పుచేతల్లో పెట్టుకున్నారని చెప్తున్నారు. బడుగు, బలహీనవర్గాలు ఎప్పుడూ బానిసలేనని, శూద్రులకు ఎలాంటి ఆస్తులు ఉండకూడదని వీడీసీలకు బోధిస్తూ, తద్వారా హిందూ ధర్మ పరిరక్షణ పేరిట అరాచకాలు చేయిస్తున్నారని కులసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. హిందూ సంఘాల నేతలు, రాజకీయ పార్టీల నాయకుల నుంచి పూర్తి సహకారం లభిస్తుండటంతో సదరు స్వామీజీ వ్యవస్థలనే శాసించే స్థాయికి చేరారని, వీడీసీ సభ్యులకు ఆ స్వామీజీ ఏం చెప్తే అదే వేదంగా మారిందని చెప్తున్నారు. ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వాలి? ఏ పార్టీకి ఓటేయాలనేది కూడా ఆ స్వామిజీ ఆదేశించడం, వీడీసీ సభ్యులు గ్రామాల్లో తీర్మానం చేయడం, అమలు చేయడం పరిపాటిగా మారిందనే ఆరోపణలున్నాయి. మాట వినని కింది కులాలను వెలివేయడం, అవమానించడం అంతా ఆ సాములోరి కనుసన్నల్లోనే, ఆయన ఆదేశాలతోనే కొనసాగుతున్నదని కుల సంఘాల నేతలు చెప్తున్నారు.

### కులబహిష్కరణలు.. దాడులు

వీడీసీల ఆగడాలకు, ఆధిపత్యానికి నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్ ఒక ఉదాహరణ. ఆరు నెలల క్రితం కల్లుగీత కార్మికులను అక్కడి వీడీసీ సాంఘిక బహిష్కరణ చేసింది. గీత కార్మిక పారిశ్రామిక సంఘంలో 53 గౌడ, 7 ఎస్సీ కుటుంబాలు ఉన్నాయి. ఆ సొసైటీ నుంచి వీడీసీకి ఏటా రూ.1.5 లక్షలు చెల్లిస్తున్నారు. ఈ ఏడాది ఏకంగా రూ.5 లక్షలు ఇవ్వాలని వీడీసీ డిమాండ్ చేయగా సొసైటీ నిరాకరించింది. దీంతో స్థానిక గౌడ కులస్థులను కాదని వేరే గ్రామస్థులతో కల్లు గీయించాలని వీడీసీ నిర్ణయించింది. దీంతో లైసెన్స్ కలిగి ఉన్న గౌడ కులస్థులు తాము హక్కులను కోల్పోతున్నామని అక్కడి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన వీడీసీ గౌడ, ఎస్సీ కులస్థులను సాంఘిక బహిష్కరణ చేసింది. ఆరు నెలలుగా వారిని ఆటోలు ఎక్కనివ్వడం లేదు. కిరాణ షాపుల్లోకి రానివ్వడం లేదు, పనికి పిలవడం లేదు. ఎవరితోనూ మాట్లాడనివ్వడం లేదు. శ్రీరామనవమి రోజు గుడికి వెళ్లగా, గౌడ కులానికి చెందిన మహిళలను అక్కడి పూజారి, వీడీసీ సభ్యులు గెంటేసి అవమానించారు. ఇదెక్కడి న్యాయమని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీడీసీ సభ్యులు గీత కార్మికుల ఈత వనాన్ని తగలబెట్టారు. ఇంత జరిగినా, కేసు పెట్టినా పోలీసులు ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

### బీసీ కమిషన్ ఆదేశించినా దిక్కులేదు

వీడీసీల అరాచకాలపై బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు వివిధ న్యాయవేదికల ద్వారా ఫిర్యాదు చేస్తూనే ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో నిరుడు బీసీ కమిషన్ క్షేత్రస్థాయిలో పర్యటించింది. బీసీల సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించింది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా అనేక బీసీ కుల సంఘాలు వీడీసీల ఆగడాలపై కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు ఫిర్యాదు చేశాయి. దీనిపై చైర్మన్ డీజీపీకి లేఖ రాస్తూ వీడీసీలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కానీ చర్యలు తీసుకోలేదు. ఇటీవల మరోసారి డీజీపీకి బీసీ కమిషన్ చైర్మన్ లేఖ రాశారు. వీడీసీల పేరిట పలువురు సామాజిక బహిష్కరణలు, దాడులకు పాల్పడుతున్నారని, వీడీసీల చట్టబద్ధత, గుర్తింపు ఏమిటని ప్రశ్నించారు. సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర డీజీపీని ఆదేశించారు. ప్రభుత్వం, డీజీపీ స్పందించలేదు. ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు, పోలీసులకు, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినా ఇదే పరిస్థితి నెలకొన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి వీడీసీల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోయిందని వివిధ కులసంఘాల నేతలు విమర్శిస్తున్నారు. కుల బహిష్కరణలు, జరిమానాతోపాటు భౌతిక దాడులకు సైతం తెగబడుతున్నారని వివరిస్తున్నారు. ప్రభుత్వ అధికారులు సైతం వీడీసీలకే కొమ్ము కాస్తున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్న వీడీసీలపై సర్కారు ఎందుకు దృష్టి సారించడం లేదని నిలదీస్తున్నారు. అందులో ఆంతర్యమేమిటి? తెరవెనుక నుంచి స్వాములోరికి, వీడీసీలలోని పెద్దలకు సహకరిస్తున్నారా? అని కులసంఘాల నేతలు ప్రశ్నిస్తున్నారు.

### ఊరూరా ఆగడాలు

- నిజామాబాద్ జిల్లా ఎర్గట్ల మండలం దోంచందలో యాదవులను ఎట్టిమందలు పెట్టాలని, గ్రామ అభివృద్ధికి డబ్బులు ఇవ్వాలని వీడీసీ సభ్యులు డిమాండ్ చేశారు. పండుగల సందర్భంలో ఎట్టిమందల గొర్రెలను వీడీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పుకోనందుకు కుర్మలకు చెందిన గొర్లను గోదావరిలో వేసి చంపారు.
- భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ, చెంగల్‌లోనూ యాదవులను హింసించారు.
- బాల్కొండ మండలం నాగంపేట గ్రామంలో ఓ గొర్రెల కాపరికి చెందిన రెండు గొర్రెలను అగ్రకులాల వారు దౌర్జన్యంగా తీసుకుపోయి కోసుకు తిన్నారనే ఆరోపణలున్నాయి.
- బాల్కొండ గ్రామంలో బుస్సాపూర్‌లో గోసంగి కులాన్ని ఇబ్బందుల పాలుచేశారు. నాగపూర్ గ్రామంలో మాలలను గ్రామ బహిష్కరణకు గురిచేశారు.
- సావేల్ గ్రామంలో దళితులను వెలివేశారు.
- గుమ్మిర్యాల్‌లో గంగపుత్రులు డబ్బులు కట్టకపోవడంతో వారిని వీడీసీ సభ్యులు హింసించి గ్రామం నుంచి బహిష్కరించారు.
- ఆర్మూర్ మండలంలో మంథని-పిప్రి గ్రామంలో చేపలు పట్టడానికి కూడా డబ్బులు ఇవ్వాలని గ్రామ అభివృద్ధి కమిటీ డిమాండ్ చేసింది. అందుకు ఒప్పుకోకపోవడంతో గ్రామ బహిష్కరణ విధించింది.
- వేల్పూర్ మండలంలో తాము చెప్పిన రేటుకే మాంసం విక్రయించాలని అరె కటికలపై ఒత్తిడి తెచ్చింది. మాట వినకపోవడంతో గ్రామ బహిష్కరణ విధించింది.
- జక్రాన్‌పల్లిలో రజకులు వీడీసీ మాట వినకపోవడంతో వారినీ గ్రామ బహిష్కరణ చేశారు.
- నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం మోతె గ్రామంలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన ఓ వ్యక్తికి తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన పట్టా భూమిపై అక్కడి ఆధిపత్య కులాలు కన్నేశాయి. అది దేవాలయ భూమి అని చెప్పి, ఆ వ్యక్తి మీద మూడుసార్లు దాడి చేశాయి. పంటను నాశనం చేశాయి. ఆ భూమి వారసత్వంగా వచ్చిందని, పట్టా ఉన్నదని చెప్పి రుజువు చేసినా పట్టించుకోకుండా సదరు వ్యక్తిని మూడేండ్లపాటు వీడీసీ సభ్యులు గ్రామం నుంచి బహిష్కరించారు.
- నిజామాబాద్ జిల్లా మారంపల్లి గ్రామంలోని ప్రభుత్వ భూమిలో అక్కడి ఎస్సీ సామాజికవర్గానికి చెందిన విద్యావంతులు లైబ్రరీ నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. పనులు ప్రారంభించేందుకు సిద్ధం కాగా వీడీసీలోని ఆధిపత్య కులాలు ఆ లైబ్రరీ నిర్మాణాన్ని అడ్డుకున్నాయి. అదే భూమిలో కమర్షియల్ కాంప్లెక్స్‌ను నిర్మించాయి. ఇదేంటని అడగ్గా విద్యావంతులైన ఆ ఎస్సీ కుటుంబాలను నాలుగేండ్లపాటు గ్రామం నుంచి బహిష్కరించాయి. ఇదే విషయమై బాధితులు జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు కమిషన్ సభ్యుడైన రాములు ఆ గ్రామాన్ని సందర్శించగా, ఆధిపత్య కులాలు భౌతిక దాడికి తెగబడ్డాయి. స్థానిక డీఎస్పీ వారిని చాటు మార్గం గుండా తప్పించారు. కానీ, వీడీసీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- కమ్మర్‌పల్లి మండలం చౌటపల్లి గ్రామంకు ఎంతో చరిత్ర ఉన్నది. ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్‌గా, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడిగా కొనసాగుతున్న సురేశ్‌రెడ్డి, మాజీ మంత్రి ఏలేటి మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ స్వగ్రామం. ఇక్కడ కూడా గౌడ కులస్థులపై కొన్నేండ్లపాటు వీడీసీ సభ్యులు సాంఘిక బహిష్కరణ విధించారు.
- జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండల కేంద్రంలో అరేపేట, నడికుడ గ్రామాల్లో మాదిగలు హనుమాన్ మాల వేసుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా వంట చేస్తుండగా వారిని వీడీసీ సభ్యులు అడ్డుకున్నారు. దళితులను కేవలం ఎంగిలి విస్తరులు తీయాలని నిర్దేశించారు. దానికి దళితులు వ్యతిరేకించారు. దీంతో గ్రామం నుంచి వారిని బహిష్కరించారు.
- జగిత్యాల జిల్లా జగ్గసాగర్‌లో మత్స్యకారులు, పద్మశాలీలు వీడీసీలో సభ్యత్వం తీసుకోవాలని, ఒక్కో సభ్యత్వానికి రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు నిరాకరించగా, ఊరి నుంచి వెలివేశారు.

#### ఉమ్మడి నిజామాబాద్, నిర్మల్‌లోనే..

వీడీసీల ఆధిపత్యం మరీ ముఖ్యంగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎక్కువైపోయిందని కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆర్మూర్, మెట్‌పల్లి, కామారెడ్డి, బోధన్, నిర్మల్ డివిజన్ ప్రాంతంలో బలహీనవర్గాలపై దాడులు ఎక్కువగా కొనసాగుతున్నాయనే ఆరోపణలున్నాయి. కరీంనగర్ జిల్లా జగిత్యాల, జగ్గసాగర్, మల్యాల, కొండగట్టు, ఆరెపేట, నడికుడ, ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్, ఆసిఫాబాద్, ఖానాపూర్, భైంసా, ముథోల్, బాసర, మెదక్ జిల్లా నారాయణఖేడ్ తదితర ప్రాంతాల్లో వీడీసీల ఆకృత్యాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందని కులసంఘాలు వివరిస్తున్నాయి.

### రాజ్యాంగేతర శక్తిగా వీడీసీలు



గ్రామాభివృద్ధి కమిటీలు రాజ్యాంగేతర శక్తిగా మారాయి. గ్రామాల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నాయి. కమిటీల్లోని అగ్రవర్ణాలు బడుగు, బలహీన వర్గాలపై అనేక దాష్టీకాలకు పాల్పడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, కలెక్టర్ల ఆదేశాలు కూడా చెల్లని దుస్థితి నెలకొన్నది. గత కొన్నేండ్లుగా దీనిపై పోరాటం చేస్తున్నాం. ప్రభుత్వం దృష్టికి అనేకసార్లు ఈ విషయాలను తీసుకెళ్లాం. వందలసార్లు ఫిర్యాదులు చేశాం. కానీ, పట్టించుకున్న పరిస్థితి లేదు. ఇకనైనా సత్వరం స్పందించాలి. వీడీసీలను రద్దు చేయాలి.

– శ్రీధర్, భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు


### రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తాం



వీడీసీల పేరిట ఆరాచకశక్తులు గ్రామాల్లో రాజ్యమేలుతున్నాయి. గ్రామాల్లో బీసీ కుల వృత్తులపై దాడులు చేస్తున్నాయి. అణచివేతకు గురిచేస్తున్నాయి. ప్రభుత్వపరంగా రావాల్సిన ఫలాలు బీసీలకు అందకుండా అడ్డుకుంటున్నాయి. రాజకీయంగా సరైన ప్రాధాన్యం బీసీలకు దక్కనివ్వడం లేదు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక వీడీసీల ఆగడాలకు అంతులేకుండా పోయింది. సర్కారు ఇకనైనా స్పందించాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఐక్య ఉద్యమ కార్యాచరణ చేపడతాం.

–రాజారాంయాదవ్, బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు

### లోకం పోకడ




## ఎండా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 41.5°c | 23.4°c |
| మెదక్ | 40.4°c | 31.1°c |
| నిజామాబాద్ | 40.2°c | 28.7°c |
| ఖమ్మం | 40.0°c | 27.0°c |
| రంగారెడ్డి | 39.5°c | 21.3°c |
| వరంగల్ | 39.0°c | 24.0°c |
| నల్లగొండ | 39.0°c | 24.2°c |
| హైదరాబాద్ | 38.2°c | 23.1°c |
| మహబూబ్‌నగర్ | 37.0°c | 27.0°c |
| కరీంనగర్ | 36.0°c | 28.0°c |

## మూడు రోజులపాటు వర్షాలు

పురోగమించనున్న నైరుతి రుతుపవనాలు

హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో విభిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. పగటిపూట గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా.. సాయంత్రం అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో వర్షాలు, నైరుతి రుతుపవనాలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. ఈ ప్రభావంతో రాగల మూడు నాలుగు రోజులలో నైరుతి రుతుపవనాలు మరింత విస్తరిస్తాయని తెలిపింది. ద్రోణి ప్రభావంతో పాటు రుతుపవనాల ప్రభావంతో మూడు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది.

#### దంచికొట్టిన ఎండలు

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. నల్లగొండ జిల్లా కేతపల్లిలో అత్యధికంగా 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణశాఖ తెలిపింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 50 నుండి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసినట్టు పేర్కొంది. రాష్ట్రంలోని 22 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, 11 జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

## నేటినుంచి సరస్వతీ పుష్కరాలు

హైదరాబాద్, మే 14(నమస్తే తెలంగాణ): కాళేశ్వరంలో నేటినుంచి పన్నెండురోజులపాటు జరగనున్న సరస్వతీ పుష్కరాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి గురువారం పుష్కరాలను ప్రారంభించనున్నారు. పుష్కరాల్లో ప్రతిరోజూ సుమారు 50వేలమంది పుష్కర స్నానాలు చేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. భక్తులకు లభించే వివిధ సేవలపై ఇప్పటికే కాళేశ్వరం యాప్, వెబ్ పోర్టల్‌ను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. ఏర్పాట్లలో భాగంగా నూతన ఘాట్ నిర్మాణం, స్నానాల కోసం షవర్లు, చలువ పందిళ్లు, లైటింగ్, తాగునీటి సౌకర్యం, అదనపు కౌంటర్లు, సిమెంట్ రోడ్ల నిర్మాణం, పిండ ప్రదాన మండపం, కేశఖండన మండపం, శాశ్వత మరుగుదొడ్లు, స్నానాల గదులు, పుష్కర ఘాట్‌పై సరస్వతీ అమ్మవారి రాతి విగ్రహం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

## అమెరికాలో నల్లగొండ జిల్లా వాసి మృతి

శోకసంద్రంలో కుటుంబ సభ్యులు


ప్రియాంక (ఫైల్)

కట్టంగూర్, మే 14 : అమెరికాలో ఉన్నత విద్యను పూర్తి చేసి అక్కడే పార్ట్ టైం జాబ్ చేస్తున్న విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందింది. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం పందనపల్లికి చెందిన కొండి వెంకట్‌రెడ్డి, శోభారాణి దంపతులకు రమేశ్ రెడ్డి, ప్రియాంక ఇద్దరు సంతానం. వీరిది పూర్తిగా వ్యవసాయ కుటుంబం. తండ్రి వెంకట్‌రెడ్డి తన కుమార్తె ప్రియాంక (26)ను ఉన్నత చదువుల కోసం అమెరికాకు పంపించాడు. ప్రియాంక 2023లో హంట్స్‌విల్లే (యూఏహెచ్)లోని యూనివర్సిటీలో చేరి అగ్రికల్చర్ ఎమ్మెస్సీ పూర్తి చేసింది. అక్కడే పార్ట్ టైం జాబ్ చేస్తూ ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నది. ఈ నెల 4న ప్రియాంక దంత సంబంధిత సమస్యతో దవాఖానకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు బ్లడ్‌లో ఇన్‌ఫెక్షన్ ఉన్నదని తెలిపారు. ఈ నెల 6న స్నానం చేసేందుకు వెళ్లిన ప్రియాంక బాత్రూంలో పడిపోవడంతో స్నేహితులు దవాఖానకు తరలించారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న ప్రియాంకను పరిశీలించి బ్రెయిన్ డెడ్ అయినట్టు వైద్యులు నిర్ధారించారు. వెంటిలేటర్ అమర్చి ఒక రోజు వైద్యం అందించగా ఈ నెల 8న మృతిచెందింది. దీంతో ప్రియాంక కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు బుధవారం ప్రియాంక భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు జరిపించారు.


డాలస్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి తలసాని. చిత్రంలో ఎమ్మెల్సీ దాసోజు, ఎమ్మెల్యే సంజయ్, మహేశ్ బిగాల తదితరులు

## డాలస్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాలు

జూన్ 1న రజతోత్సవ సభలకు కేటీఆర్‌కు ఆహ్వానం

సభ పోస్టర్ విడుదల చేసిన మాజీ మంత్రి తలసాని

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): అమెరికాలోని డాలస్ నగరంలో జూన్ 1న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని మాజీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. బుధవారం తెలంగాణ భవన్‌లో.. డాలస్‌లో నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాల పోస్టర్‌ను బీఆర్‌ఎస్ గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల, ఎమ్మెల్యే కే సంజయ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌కుమార్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ బిడ్డలు రాష్ట్ర తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలకు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తన పదేండ్ల పాలనలో అనేక అద్భుతాలు సాధించి చూపారని పేర్కొన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ బహిరంగ సభ కనీవినీ ఎరుగని రీతిలో ఎంతో అద్భుతంగా జరిగిందని గుర్తుచేశారు. ఎన్‌ఆర్‌ఐలుగా ఉండి ప్రపంచ వ్యాప్తంగా బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాలు జరిపేందుకు ముందుకు రావడం చాలా మంచి పరిణామమని అభినందించారు. అమెరికాతోపాటు యూకే, కెనడా, ఆస్ట్రేలియాలోనూ బీఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాలు ఏడాది పొడవునా ఘనంగా జరుగుతాయని తలసాని పేర్కొన్నారు.

#### తెలంగాణ సాంస్కృతిక వైభవంగా సభ: మహేశ్ బిగాల

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభలు విదేశాలలో, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా, తెలంగాణ ఆట, పాటలతో ఘనంగా జరపనున్నామని ఆ పార్టీ గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ సెల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల తెలిపారు. అందులో భాగంగా అమెరికాలోని డాలస్‌లో జూన్ 1న ఈ సభను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఈ సభకు కేటీఆర్ హాజరవుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్యనేతలు, అమెరికాలోని తెలంగాణ ప్రజలు ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. దాదాపు 10 వేల మందికి పైగా ఈ సభకు హాజరయ్యేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చందుతాళ్ల, అభిలాష్ రంగినేని, పుట్టా విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజినీరింగ్ ఫీజులు పెంచొద్దు

టీపీటీఎల్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కోర్సుల ఫీజులు పెంచి, విద్యార్థులపై భారం మోపొద్దని, లెక్చరర్స్‌కు జీతాలు ఇవ్వకుండా మోసం చేస్తున్న కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్, స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేశాయి. బుధవారం ఆయా సంఘాల ప్రతినిధులు ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తంకు వినతిపత్రం సమర్పించారు. ఇంజినీరింగ్ కాలేజీల్లో ఫీజుల ఖరారు కోసం ఫీజు రెగ్యులేటరీ కమిటీ రూ.2 లక్షలకు పైగా ఫీజులను నిర్ణయిస్తూ ప్రతిపాదనలు పంపించారని ఆయా సంఘాలు తెలిపాయి. అంత భారీగా ఫీజులు ఎలా నిర్ణయిస్తారని, తప్పుడు ఆడిట్ లెక్కల ఆధారంగా ఫీజులు ప్రతిపాదనలు చేశారని ఆరోపించాయి.

## కేఆర్‌ఎంబీని అమరావతికి తరలించాలి

బోర్డు చైర్మన్‌కు ఏపీ ఈఎన్సీ లేఖ

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) కార్యాలయాన్ని అమరావతికి లేదా విజయవాడకు తరలించాలని ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ వెంకటేశ్వరావు కోరారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని బుధవారం కేఆర్‌ఎంబీ చైర్మన్‌కు లేఖ రాశారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేఆర్‌ఎంబీ ప్రధాన కార్యాలయాన్ని ఏపీలో ఏర్పాటు చేయాల్సి ఉన్నదని, దీనిపై అపెక్స్ కౌన్సిల్ 2వ సమావేశంలోనూ అంగీకారం కుదిరిందని ఆ లేఖలో గుర్తుచేశారు.

## బాసర ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడి

- ఆంధ్రా స్వాములోరి అనుచరుడి దౌర్జన్యం
- వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చి దాడి
- ప్రాణహాని ఉందంటూ పోలీసులను ఆశ్రయించిన అర్చకుడు సంజీవ్ పూజారి


బాసర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన పూజారి

బాసర, మే 14: బాసర ఆలయ ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారిపై బుధవారం సాయంత్రం ఆంధ్రా స్వాములోరి అనుచరుడు దాడి చేశాడు. రోజూ మాదిరిగానే వాకింగ్ చేస్తుండగా వెనుక నుంచి వచ్చి ముఖంపై పిడిగుద్దులు గుద్దుతూ.. తమ జోలికి వస్తే చంపేస్తామంటూ బెదిరించాడు. పూజారి కథనం ప్రకారం.. సంజీవ్ పూజారి రోజూ మాదిరిగానే బుధవారం సాయంత్రం కమ్మసంఘం ఎదురుగా ఉన్న దారిలో (ఆంధ్రా స్వాములోరి శ్రీ వేద భారతి పీఠం ముందు) వాకింగ్ చేస్తున్నారు. వెనుక నుంచి వచ్చిన స్వాములోరి అనుచరుడు నూకం రామారావు పూజారిని దుర్భాషలాడుతూ ముఖం, తలపై తీవ్రంగా దాడి చేశాడు. బూతులు తిడుతూ.. 'నిన్ను ఇంటికి చేరుకునేలోపు చంపేస్తాం. వేద భారతి పీఠం స్వామీజీ అనుకుంటే నిన్ను ఇప్పుడే చంపేస్తాం. నువ్వు ఆలయంలో ఉద్యోగం ఎలా చేస్తావో మేము చూస్తాం' అంటూ దాడి చేశాడు. దీంతో అక్కడి నుంచే '100' నంబర్‌కు ఫోన్ చేశానని, కాల్ కలువకపోవడంతో ఎలాగోలా తప్పించుకొని ఇంటికి చేరుకున్నానని సంజీవ్ పూజారి తెలిపారు. తన సోదరుడి కుమారుడు వెంకటేశ్ పూజారి పోలీసులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. నూకం రామారావు, ఆంధ్రా స్వాములోరి నుంచి తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. బాసర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.

#### విచారణ సమయంలోనే దాడి..

శ్రీ వేద భారతి పీఠం పాఠశాల నిర్వాహకుడు వేదావిద్యానందగిరి స్వామిపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. వేద పాఠశాలలో ఓ బీసీ విద్యార్థి తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితికి చేరుకోగా, సాక్షిగా ఉన్న మరో బీసీ విద్యార్థి అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆంధ్రా సాములోరి లీలలపై 'బాసరలో నెత్తుటి ఘోష' 'మణికంఠది హత్యా.. ఆత్మహత్యా?' 'ఆంధ్రా సాములోరా.? బాసర అమ్మవారా?' ఇలా వరుస కథనాలు 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమయ్యాయి. విద్యార్థులపై దాడి.. స్వామీ ఆగడాలపై రాష్ట్ర ప్రభుత్వం సైతం ఆర్డీవో ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి కమిటీని నియమించి విచారణకు ఆదేశించింది. ఇంత వివాదం జరుగుతున్న సమయంలోనే ఆలయ ప్రధాన అర్చకుడిపై.. ఆంధ్రాస్వాములోరి అనుచరుడు దాడి చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంపై బాసర గ్రామస్థులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. విచారణను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతోనే వేద పాఠశాల నిర్వాహకులు ఇలాంటి పనులకు పాల్పడుతున్నారంటూ ఆరోపిస్తున్నారు. పూజారిపై దాడి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నత స్థాయి కమిటీ త్వరగా విచారణ పూర్తి చేసి.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బీఆర్‌ఎస్ వేసిన బాటలు.. రైతులకు అందిన ఫలాలు

- మూడేండ్ల తర్వాత మొదటి పంటను కోసిన పామాయిల్ రైతులు

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ హయాంలో ప్రారంభించిన పామాయిల్ సాగు సత్ఫలితాలనిస్తున్నది. పంట చేతికి రావడంతో రైతు ముఖంలో ఆనందం కనిపించింది. 2022లో నల్లగొండ జిల్లా తేలకంటిగూడెంలో 20 ఎకరాల్లో రైతులు పామాయిల్‌ను సాగు చేశారు. మూడేండ్ల తర్వాత బుధవారం రైతు విజయనాథ్‌రెడ్డి పొలంలో పామాయిల్ గెలలను ఉద్యాన శాఖ అధికారుల సమక్షంలో కోశారు. తొలి కోతలో ఎకరాకు 3 టన్నులకుపైగా దిగుబడి వచ్చినట్టు జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనంతరెడ్డి తెలిపారు. ప్రస్తుతం టన్ను ధర రూ.21వేలు ఉందని చెప్పారు. ఎకరానికి రూ.40వేల వరకు మిగులుతుందని వివరించారు. బీఆర్‌ఎస్ హయాంలో పామాయిల్ సాగు కోసం ప్రభుత్వం భారీగా రాయితీ అందించింది.


పామాయిల్ తొలికోత తర్వాత గెలలతో రైతు, ఉద్యాన అధికారులు

## తక్షణమే ఉద్యోగాలు భర్తీ చేయాలి

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని పోలీసుల నిరుద్యోగ జేఏసీ ప్రతినిధులు ఆకాశ్, శంకర్, కల్యాణ్ డిమాండ్ చేశారు. 2016, 2018, 2022లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 15 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క పోలీసు ఉద్యోగమూ ఇవ్వలేదని మండిపడ్డారు. వెంటనే పోలీసు ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ హామీ ఇచ్చిన కాంగ్రెస్ గెలిచిన తర్వాత ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్‌గా ఉన్న ఏపీకి చెందిన పీవీ శ్రీనివాసరావును వెంటనే తొలగించాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు.